06ATP27_06ATP27.qxd 13-01-2026 PM 10:36 Page 1



## 2026 ఫిబ్రవరి నెల క్యాలెండర్‌లో అద్భుతం..!!

- ఆదివారం నుండి శనివారం వరకు ప్రతి వారానికి కచ్చితంగా 4 రోజులు- 11 సంవత్సరాలకు ఒకసారి ఇలా ఏర్పడుతుందంటున్న పరిశీలకులు- పర్ఫెక్ట్ ఫిబ్రవరి పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా క్యాలెండర్

**ఉరవకొండ, జనవరి 13 ప్రభాతవార్త**



2026 ఫిబ్రవరి నెల క్యాలెండర్

2026 ఫిబ్రవరి నెల క్యాలెండర్‌లో అద్భుతం కనిపిస్తోంది. ఇది లీపు సంవత్సరం కాదు కాబట్టి ఫిబ్రవరి నెలలో 28 రోజులే ఉండగా ఆదివారం మొదలు శనివారం వరకు ప్రతి వారానికి 4 రోజులు ఉంటున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంతో ప్రారంభమై 28వ తేదీ శనివారంతో ముగియనుంది. ఒకసారి ఫిబ్రవరి నెల క్యాలెండర్‌ను పరిశీలిస్తే ఈనెలలో ఎటువంటి అడ్డంకులు లేకుండా ఒక పరిపూర్ణమైన దీర్ఘచతురస్రాకారంలో తేదీల అమరిక కనిపిస్తుంది. ఈనెలలో 4 ఆదివారాలు, 4 సోమవారాలు, 4 మంగళవారాలు, 4 బుధవారాలు, 4 గురువారాలు, 4 శుక్రవారాలు, 4 శనివారాలను గమనించవచ్చు. ఇలాంటి ఫిబ్రవరి నెల ప్రతి 6 లేదా 11 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే వస్తుందని క్యాలెండర్ నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి ఫిబ్రవరి నెల 2015లో వచ్చిందని మళ్లీ ఇలాంటి ఫిబ్రవరి నెల 2037లో వస్తుందని సమాచారం.

## ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

- ఘనంగా క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్‌జోన్స్ జయంతి

**ఉరవకొండ, జనవరి 13 ప్రభాతవార్త**


అన్నదానం నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్‌జోన్స్ జయంతిని పురస్కరించుకొని ఉరవకొండ లయన్స్‌క్లబ్ మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌వద్ద అన్నదానం నిర్వహించింది. తొలుత మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా 450 మందికిపైగా భోంచేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ తోటివారికి, సమాజానికి సేవ చేయాలన్న తలంపుతో మెల్విన్‌జోన్స్‌చే స్థాపించబడిన లయన్స్‌క్లబ్ నేడు ప్రపంచ దేశాల్లో వేలాది శాఖలుగా విస్తరించి ఉచిత ఆరోగ్య శిబిరాలు, పేద విద్యార్థులు, క్రీడాకారులకు ప్రోత్సహకాలు అందిస్తున్నదన్నారు. సమాజ శ్రేయస్సు కోసం తమ సొంత నిధులను వెచ్చిస్తూ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కరణం వేదమూర్తి, రీజినల్ ఛైర్మెన్ టి.గణేష్‌బాబు, సభ్యులు వై.ప్రభాకర్‌నాయుడు, యం.సి.నాగభూషణ, జి.కె.శ్రీధర్, సి.నాగేశ్వరరావు, ఇ.శ్రీరాములు, ఎస్.షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బు, బంగారం తీసుకొని తిరిగి ఇవ్వకుండా మోసం

- మహిళ విషం తీసుకుని ఆత్మహత్యాయత్నం

**రామగిరి, జనవరి 13 ప్రభాతవార్త**


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

రామగిరి మండలం కుంటిమద్ది పంచాయతీ, శేషంపల్లి గ్రామానికి చెందిన పరంధామ, పోలప్ప, వయస్సు 42 సంవత్సరాలు అనే వ్యక్తి, రొద్దం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన వడ్డే సుబ్బులక్ష్మి (వయస్సు 38 సంవత్సరాలు) అనే మహిళతో శేషంపల్లి గ్రామంలో పశువులు మేపుకునే క్రమంలో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో నమ్మకం ఏర్పడిన అనంతరం, పరంధామ ఆమె వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల నగదు మరియు 5 తులాల బంగారం తీసుకుని, తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఈరోజు ఉదయం 11 గంటల సమయం నందు పరంధామ కోసం వెతుక్కుంటూ వచ్చి అతను స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వడ్డే సుబ్బులక్ష్మి, నాగసముద్రం గేటు వద్ద విషం తీసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. విషయం తెలిసిన వెంటనే ఆమెకు చికిత్స కొరకు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది

## ప్రత్యేక ముగ్గుల పోటీని సద్వినియోగం చేసుకోండి

- నగదు బహుమతితోపాటు హాజరైన మహిళలందరికీ చీరలు
- ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధం

**అగళి, జనవరి 13 ప్రభాతవార్త**

14వ తేది బుధవారం అగళి మండలంలో ప్రత్యేకంగా ముగ్గుల పోటీలతోపాటు ఆవులు, ఎద్దుల ప్రదర్శన, కోడిపందెలు, వంటి పోటీలను నిర్వహిస్తామని జడ్పిటిసి ఉమేష్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు 18 సంవత్సరాలు పైబడి ఉండాలని, స్థానిక మండలానికి చెందిన వారై ఉండాలన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు ఆధార్, రేషన్ జెరాక్స్ కాపీలతో హ్యాజరు కావాలన్నారు. బుధవారం ఉదయం 9 నుంచి 10 గంటలలోపు పోటీలో పాల్గొనేవారు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ ముగ్గుల పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారు. ఈ పోటీలకు సర్వం సిద్ధం చేశారు. ముగ్గుల పోటీలలో ప్రథమస్థానం పొందిన వారికి రూ.5వేలు నగదు, పట్టు చీరను ప్రధానం చేస్తామని, అదే విధంగా ద్వితీయ బహుమానం 4వేలు, పట్టు చీర, తృతీయ బహుమానం 3వేల నగదు, పట్టు చీర, 4వ బహుమతి వెయ్యి రూపాయల నగదు, పట్టు చీర పంపిణీ చేయనున్నట్లు జడ్పిటిసి ఉమేష్, ఏఓ రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. అదే విధంగా రైతులు భాగా అలంకరించి ఎద్దులను, ఆవులను ప్రదర్శించ వచ్చున్నారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన రైతుకు 3వేలు నగదు, బట్టలు, ద్వితీయ బహుమతిగా 2వేల నగదు, బట్టలు పంపిణీ చేస్తామని, తృతీయ బహుమతి పొందిన వారికి వెయ్యి రూపాయల నగదు, బట్టలు పంపిణీ చేస్తామని తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ఒక్కొ చీరను పంపిణీ చేయనున్నట్లు జడ్పిటిసి తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు అయ్యప్ప స్వామి పడిపూజ అన్నదాన కార్యక్రమం

**అమరాపురం జనవరి 13 ప్రభాతవార్త**



మండల పరిధిలోని కెంకెర గ్రామంలో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద బుధవారం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి పడిపూజ మరియు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు జి హెచ్ రాయుడు, జి శ్రీనివాస్, జి హనుమంతరాయ, కేహెచ్ సురేష్, హెచ్ రఘు కుమార్, కించప్ప, సోమశేఖర, గుజ్జారప్ప, తదితరులు తెలిపారు, అయ్యప్ప స్వామి పడిపూజ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కేకేఆర్ ఫ్రెండ్స్ ఫరెవర్ గ్రూప్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెంకెర గ్రామ ప్రజలు మరియు చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నేతన్న నేస్తం నిధుల విడుదల చేయాలి

**ధర్మవరంటౌన్, జనవరి 13 ప్రభాతవార్త**


ఆర్డీవోకు వినతిపత్రం అందస్తున్న చేనేత నాయకులు

చేనేత కార్మికులకు రావాల్సిన నేతన్న నేస్తం నిధులు విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జింకాచలపతి ఆర్డీఓ మహేశ్ కు విన్నవించారు. ఈ మేరకు ఆయనతో పాటు చేనేత నాయకులు ఆర్డీఓమహేష్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాది కల్పన, సంక్షేమం గురించి చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదని ఆర్డీఓకు విన్నవించారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని యజమానులు ఉల్లంఘిస్తున్న చేనేత, జౌళిశాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమల రాయితీలను రద్దు చేసి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే చేతివృత్తిదారులందరికి విశ్వకర్మ యోజన పథకం రుణాలను మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో చేనేత కార్మిక సంగం నాయకులు వెంకటస్వామి, చెన్నంపల్లి శ్రీనివాసులు, ఈశ్వరయ్య. చెన్నభుజంగం ఉన్నారు.

## ప్రథమ బహుమతి పొందిన యువతికి ఘన సన్మానం

**పుట్టపర్తి టౌన్, జనవరి 13, ప్రభాతవార్త**



యువతికి చెక్కును అందజేస్తున్న నిర్వాహకులు రమేష్

సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో బిల్డర్ సాయి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి పొందిన యువతి ఇందిర ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో సోమవారం ముగ్గుల పోటీలు జరగగా దాదాపు 500 మంది మహిళలు ఈ ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలలో ప్రథమ స్థానంలో నిలచిన యువతి ఇందిరా ను సోమవారం రాత్రి 10 గంటల తర్వాత మొదటి విజేతగా ప్రకటించారు. బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్య గారి పల్లి గ్రామానికి చెందిన బాలప్ప కుమార్తె ఇందిర అనంతపురంలో విద్యను అభ్యసిస్తోంది. సోమవారం పుట్టపర్తిలో జరిగిన ముగ్గుల పోటీలలో ఇందిర అనే యువతి ప్రథమ స్థానంలో నిలవగా ఆమెకు నిర్వాహకులు సాయి రమేష్ కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం యువతి ఇంటి వద్దకు వెళ్లి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆ యువతిని గ్రామంలో ఊరేగించారు. ముగ్గుల పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి లక్ష రూపాయల తో పాటు గ్రామానికి పేరు సంపాదించిన యువతీ ఇందులోను గ్రామస్తులు అభినందించారు.

## అప్పుల బాధతో యువరైతు ఉరివేసుకొని ఆత్మహత్య

**అమరాపురం జనవరి 13 ప్రభాతవార్త**


నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల పరిధిలో ఊదుగురు గ్రామానికి చెందిన వీరేష్ (38) అని యువరైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య కావ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎస్ ఐ రమణ తెలిపారు. వివరాలలోకి వెళితే గ్రామానికి చెందిన సిద్దేశ్వరప్ప కుమారుడు వీరేష్ తమకు ఉన్న ఐదు ఎకరాల పొలంలో బోరు వేయడంతో పాటు వక్క మరియు దానిమ్మ పంటలు సాగు చేస్తున్నట్లు దీనికి దాదాపు 18లక్షలదాకా అప్పులు చేసినట్లు అప్పుల బాధ అధికం కావడంతో జీవితంపై విరక్తిచెంది తనఇంట్లోఉన్న బాత్రూంలో ఉరివేసుకొనిఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కేనరసింహమూర్తి, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మద్దనకుంట రఘు, మాజీ సర్పంచ్ ప్రకాష్, యువ నాయకుడు హలుకూరు నాగరాజు లు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు వీరేష్ భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ విషయాన్ని మడకశిర ఎమ్మెల్యే, మాజీఎమ్మెల్సీలకు తెలియజేసినట్లు నాయకులు పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం మరియు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులుభరోసా ఇచ్చారు. యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానికతహసిల్దార్ లక్ష్మీనరసింహం, వ్యవసాయ అధికారి మంజునాథ్ తదితరులు కుటుంబ సభ్యుల ద్వారా వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

## వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం తగదు

**గుత్తి, జనవరి 13 ప్రభాతవార్త**



నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే రీతిన వైద్య కళాశాల నిర్మాణాలను పిపిపి పద్ధతిన చేపట్టడం తగదని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరభద్ర స్వామి, మండల కార్యదర్శి రామదాసు, జిల్లా నాయకులు రమేష్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నెంబర్ 590, 847లను జిల్లా వ్యాప్తంగా భోగి మంటలలో దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈనెల 18న ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి రాజా, నాయకులు మహబుదాబి, నజీర్, వెంకట్రాముడు, నరసింహస్వామి, బాషా, డేనియల్, రామకృష్ణ, వెంకటేశు, లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

**లేపాక్షి, జనవరి 13 ప్రభాతవార్త**

ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభల కరపత్రాలను మండల కేంద్రమైన లేపాక్షిలోని నీలం సంజీవరెడ్డి కాలనీలో మండల కార్యదర్శి గౌతంకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాదాపీర్, కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మంలో నిర్వహించే శతాబ్ది ఉత్సవాలకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. లక్షలాది మందితో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. బహిరంగసభలో తమ తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 17న ధర్మవరం నుండి రాత్రి 7 గంటలకు ఖమ్మం వరకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుల్జార్, అనిత, మమత, కాంతమ్మ, మనీ, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బీచిగానిపల్లి పంచాయతీలో కాఫీ విత్ వైసీపీ క్యాడర్

**పరిగి జనవరి 13 (ప్రభాత వార్త):**


కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు

సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం, పరిగి మండలం, బీచిగానిపల్లి పంచాయతీ వంగలపల్లి, పాత్రగానిపల్లి గ్రామాలలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రతి గడపకు వెళ్లి, జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాడని, ఎప్పుడు ప్రజలు శ్రేయస్సు కోరే జననాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ప్రతి ఒక్కరికి గుర్తు చేశారు, రైతులకు ప్రతి ఏడాది రైతు భరోసా తో పాటు పంట బీమా ఇస్తూ రైతులకు భరోసా నిలబడ్డ ఏకైక నాయకుడు జగనన్న అని అన్నారు, ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి రెండు సంవత్సరాలు అవుతున్న ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తీవ్రంగా అన్యాయం చేశారని, ప్రతి ఒక్కరికి వివరిస్తున్న రాష్ట్ర మాజీ మంత్రి,శ్రీ సత్యసాయి జిల్లా వైయస్ఆర్ సీపీ అధ్యక్షురాలు పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.వి.ఉషశ్రీచరణ్ ఈ కార్యక్రమంలో భాగంగా బీచిగానిపల్లి పంచాయతీలో పంచాయతీ వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలతో కలిసి పంచాయతీ కమిటీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పరిగి మండల ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, వైసీపీ కార్యకర్తలు,బీచిగానిపల్లి పంచాయతీ మరియు వంగలపల్లి, పాత్రగానిపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పెనుకొండ సంక్రాంతి సంబరాల్లో క్రికెట్ మ్యాచ్ పోటీలు

### విజయం సాధించిన కౌన్సిలర్ గిరి టీం


క్రికెట్ మ్యాచ్ లో పాల్గొన్న క్రికెటర్లు

**పెనుకొండ జనవరి 13 (ప్రభాతవార్త)**

మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో పెనుకొండలో జరుగుతున్న సంక్రాంతి


క్రికెట్ ను పర్యవేక్షిస్తున్న టిడిపి నాయకులు

సంబరాలలో భాగంగా మంగళవారం పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ మ్యాచ్ పోటీలు నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో కౌన్సిలర్ గిరి టీం,కౌన్సిలర్ హనుమంతు టీంలు తలపడ్డాయి. టాస్ గెలిచిన గిరి టీం ముందుగా బ్యాటింగ్ ఎంచుకొని, నిర్ణీత 12 ఓవర్లలో 89 పరుగులు సాధించింది. ఈఇన్నింగ్స్‌లో గిరి 41 పరుగులు చేసి జట్టుకు కీలక సహకారం అందించారు. బౌలింగ్‌లో జగదీష్ సాయి 5 వికెట్లు పడగొట్టి ప్రతిభ కనబరిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హనుమంతు టీం,12 ఓవర్లలో 86 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఈ జట్టులో మహేంద్ర 39 పరుగులు చేసి ఆకట్టుకున్నారు. బౌలింగ్‌లో గిరి టీంలో గిరి3వికెట్లు, రఘువీరా 2 వికెట్లు, షౌకత్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం షార్ట్ పుట్, జావెలిన్ క్రీడా పోటీల్లో పలువురు పాల్గొన్నారు . గెలిచిన మరియు రన్నరప్ టీం లకు కప్ లు ప్రదానం, బుధవారం జరిగే ముగ్గుల పోటీ దారులకు రాష్ట్ర మంత్రి సవితమ్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయబడతాయి అని నిర్వాహకులు తెలిపారు. బుధవారం నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలలో ముగ్గుల పోటీలో పాల్గొను వారికి ఉదయం8గంటల నుంచి 9 గంటల వరకు ముగ్గుల పోటీ దారులకు టోకెన్లు కేటాయింపు,9గంటల నుంచి 11గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించబడును అని ఈ కార్యక్రమాలు మంత్రిగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. మంత్రి సవితమ్మ నివాసం నుండి జానపద నృత్యం. కోలాటం బృందాలు, హరిదాసులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు ముగ్గుల పోటీలు,హరిదాసు, గంగిరెద్దుల ప్రదర్శనలు,ఎద్దుల బండ్ల ప్రదర్శన,పొట్టేళ్ల పోటీలు,కోడి పందాలు,తాడులాగు పోటీలు,గాలిపటాల పోటీలను పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ,/మునిసిపల్ కమిషనర్ , ఎంపీడీవో,ఎన్డీయే కూటమ నాయకులు పాల్గొంటారు అని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ జూనియర్ కళాశాల మైదానము లో మంత్రి సవిత సంక్రాంతి భోజన వసతి ఏర్పాటు చేశారని తెలిపారు. క్రికెట్ పోటీలను పట్టణ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, టిడిపినాయకులు ప్రభంజన్‌స్వామి, సుబ్రహ్మణ్యం, కురుబ నంజుండ, చంద్రకాంతమ్మ తదితరులు పర్యవేక్షించారు. క్రికెట్ పోటీలలో టిడిపి నాయకులు త్రివేంద్ర, బాబుల్ రెడ్డి,మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైట్ అప్. కే టి సి.1 నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు దృశ్యం. 2026 నూతన సంవత్సర జనసేన పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ ..కొత్తచెరువు జనవరి 13 ప్రభాతవార్త. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ లు ధర్మవరం జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం బుక్కపట్నం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు మీనా గణేష్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆ పార్టీ జనసైనికులతో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బుక్కపట్నం మండల అధ్యక్షులు జయరాం , టౌన్ కన్వీనర్ దాసరి శ్రీనివాసులు , జనసేన నాయకులు , తోట వెంకటేష్ , జనార్ధన్ , కుజీర్ , కిషోర్ కుమార్ , ధర్మవరం జనసేన నాయకులు జన సైనికులు పాల్గొన్నారు.

## కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

-సిఐ శివ ఆంజనేయులు

**పుట్టపర్తి (కల్చరల్), జనవరి 13, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ సందర్భంగా పుట్టపర్తి అర్బన్ పరిధిలో ఎక్కడైనా కోడిపందాలు, జూదాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని అర్బన్ సిఐ శివ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలియజేశారు. పుట్టపర్తి, ఎనుములపల్లి, బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, పెద్దకమ్మవారిపల్లి గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలలో గాని పుట్టపర్తి టౌన్ లో గాని ఎవరైనా కోడి పంద్యాలు, పేకాట వంటి జూదం ఆడిన వారిపై ఆర్గనైజింగ్ క్రైమ్ కింద కేసు నమోదు చేయడంతో పాటు వారిపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం, జిల్లా బహిష్కరణ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## ప్రతి కుటుంబం భోగ భాగ్యాలతో వెలుగొందాలి

- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, జెసి ఎం. మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి (కల్చరల్), జనవరి 13, ప్రభాతవార్త**

భోగి మంటల వెచ్చటి వెలుగులు ప్రతి ఇంటికి ఆరోగ్యం, శ్రేయస్సు అందించాలని, మకర సంక్రాంతి కాంతులతో ప్రతి గృహం సంక్షేమం, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మోర్య భరద్వాజ్ ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సర ఆరంభంలో వచ్చే ఈ పంట పండుగలు ప్రతి కుటుంబానికి భోగభాగ్యాలు, సుఖసంతోషాలు అందించాలని వారు ఆకాంక్షించారు. భోగి పండుగను సంప్రదాయబద్ధంగా, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా జరుపుకుంటూ, అందమైన రంగవల్లికలు, రుచికరమైన పిండివంటలు, ఆటపాటలతో బంధుమిత్రుల మధ్య ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలను నిర్వహించుకోవాలని కోరారు. సమైక్య భావంతో, పరస్పర సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

## పకడ్బందీగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ జరగాలి

- జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి (కలెక్టరేట్), జనవరి 13, ప్రభాతవార్త**


జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయా మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఫిబ్రవరి 2 నుంచి 9వ తేదీ వరకు చేపట్టనున్న పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంపై తీసుకోవాల్సిన విధివిధానాలు, ముందస్తు ఏర్పాట్లపై జేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రీసర్వే పూర్తయినా ఇంకా పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కాని గ్రామాల విషయంలో, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున ఎంపిక చేసి ఈ పంపిణీ కార్యక్రమంలో భాగం చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాసుపుస్తకాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పాసుపుస్తకాల పంపిణీ సమయంలో భూ రికార్డులు, సర్వే వివరాలు సక్రమంగా ఉండేలా ముందుగానే పరిశీలించాలని, పారదర్శకత పాటిస్తూ, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనందకుమార్, కలెక్టరేట్ ఏఓ సక్సేన, మండల తాసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల నిర్వహణకు శరవేగంగా ఏర్పాట్లు

### ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిషనర్ సతీష్ కుమార్


సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిషనర్

**పెనుకొండ జనవరి13 (ప్రభాతవార్త)**

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పెనుకొండలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ మంగళవారం పర్యవేక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నుండి నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను మంత్రి సవిత ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కాలేజ్ మైదానం శుభ్రపరచడం, టెంట్లు వేయడం,స్టేజి నిర్మాణం,షామియానాల ఏర్పాటు, వివిధ పోటీలకు మార్కింగ్ వేయడం వంటి అనేక పనులను శరవేగంగా చేస్తున్నారు. ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ సూచనలు మేరకు మున్సిపల్ సిబ్బంది శరవేగంగా చేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కూటమి టిడిపి నాయకులు కురుబ నంజుండ, చంద్రాయుడు,మైనార్టీ నాయకులు ఆంద్రూస్ ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొడవలు వద్దు... ఆనందంగా జీవించండి...!..

### ప్రజలకు సూచించిన ఎస్సై

**ధర్మవరం రూరల్ జనవరి 13 ప్రభాతవార్త**



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

గొడవల జోలికి వెళ్లి ప్రశాంతమైన జీవితానికి దూరం కాకుండా... ఈ పిల్లల బంగారు భవిష్యత్తుకు దోహత పడాలని రూరల్ ఎస్ ఐ రాజశేఖర్ పేర్కొన్నారు . ఈ సందర్భంగా మండల పరిధిలోని నాగులూరు గ్రామం లో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. మద్యానికి, పేకాటకు దూరంగా ఉండాలని మహిళల పట్ల గౌరవంగా ఉండాలని స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని ఇంటి నివాసాల వద్ద సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకోకుండా ఆనందమైన జీవితం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దీంతో కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించవచ్చునన్నారు. మధ్య పెట్టే మాటలు వినడం... గ్రామాల్లో కలిసిమెలిసి సఖ్యతగా మెలగాలని ఆయన కోరారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులదృష్టికితీసుకురావాలని ఎస్సై ప్రజలకు సూచించారు.

## పండుగ వేళ అప్రమత్తంగా ఉండండి

**డి.హిరేహాళ్ జనవరి 13 ప్రభాతవార్త**

సంక్రాంతికి ఊళ్లకు వెళ్తున్నారా దొంగల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా ఇళ్ళకు తాళాలు వేసుకొని వెళ్లాలని ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం డి.హిరేహాళ్ ఎస్ఐ అందించిన వివరాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. దొంగతనాలు, నేరాల నుంచి రక్షణకు విలువైన వస్తువులు, నగదు ఇంట్లో వదలకుండా బ్యాంక్ లాకర్లలో లేదా బంధువుల వద్ద భద్రపరచుకోవాలని ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇంటి తలుపులు, కిటికీలు భద్రంగ లాక్ చేసి తమ ఇంటి వైపు గమనించాలని మీ పొరుగింటి వారిని కోరాలని ఆయన చెప్పారు. పండుగ సంతోషంతో పాటు ఇంటిలో ఉన్న నగలు, ఇతర వస్తువులు జాగ్రత్తగా దాచడం మర్చిపోరాదని, పోలీసులు గట్టి నిఘా ఉంచి పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఎస్సై చెప్పారు.

# జాతీయస్థాయి ఎడ్ల పందాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

**తాడిపత్రిటౌన్, జనవరి 13 ప్రభాతవార్త**



పోటీలను తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బండలాగుడు ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగు తున్నాయి. మూడవ రోజు నిర్వహి స్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయ సంస్కృతులను గుర్తుంచుకునే విధంగా ఎద్దుల పందాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ఎడ్ల పందాలు నిర్వహించడంతో యర్రగొండ పాలెంకు జాతీయ స్థాయిలోనే గుర్తింపు వచ్చిందన్నారు. తెలుగు రాష్ట్రాలే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి ఎద్దులు పందాల్లో పాల్గొనడం చాలా గర్వంగా ఉందన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెంది పార్టీలకతీతంగా యువత పని చేస్తుండటంతో ఈ ఎడ్ల పందాలు విజయవంతమవుతున్నాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

- ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి







అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి, హాజరైన ప్లాంట్ సిబ్బంది

**తాడిపత్రిఅర్బన్, జనవరి 13 ప్రభాతవార్త**

వాహనదారులు రహదారిపై ప్రయాణించే సమయంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా వారితో పాటు వారి కుటుంబం కూడా సురక్షితంగా వుండేందుకు అవకాశాలు మెండుగా వుంటాయని తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తాడిపత్రి పట్టణ సమీపంలోని అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి, అర్జాస్ స్టీల్స్ సేఫ్టీ హెడ్ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, 18 సంవత్సరాలలోపు వారు వాహనాలు నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గుర్తులు గమనించి సిగ్నల్స్ లైట్లను అనుసరించి వాహనాలను నడపాలని, వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి వుండాలని వారు ప్లాంట్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్జాస్ స్టీల్స్ సిఎస్ఆర్ హెడ్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- ఎస్ఐ ఆంజనేయులు

**పెద్దవడుగూరు, జనవరి 13 ప్రభాతవార్త**



ఎస్ఐ ఆంజనేయులు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు, టెంకాయ ఆటలు తదితర జూదాలు నిర్వహించినా, పాల్గొన్న, ప్రోత్సహించినా అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి జగదీష్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కోడి పందాలు, టెంకాయ ఆటలు, తదితర జూదాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు తెలియచేశారు. ప్రజలు కోడి పందాలు, టెంకాయ ఆటలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కోడిపందాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు తెలిస్తే అటువంటి వారిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కోడిపందాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా, శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పెద్దవడుగూరులో ముగ్గుల పోటీలు





బహుమతి అందచేస్తున్న దృశ్యం, ముగ్గు వేసిన దృశ్యం

**పెద్దవడుగూరు, జనవరి 13 ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో జె.సి ఫ్యామిలీ ఆధ్వర్యంలో సంక్రాంతి హరితలక్ష్మి ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఇందులో మొదటి బహుమతి వనజకుమారి (పెద్దవడుగూరు), ద్వితీయ బహుమతి వనమాలి, తులసి, తృతీయ బహుమతి సుశీల, మంజుల, వేదవతి, అరుణ, నాల్గవ బహుమతి నలుగురు మహిళలు, ఐదవ బహుమతి 8 మంది మహిళలు విజేతలుగా నిలిచారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి గ్రైండర్, రెండవ బహుమతులు-2 రైస్‌కుక్కర్, మూడవ బహుమతులు-3 ప్రెసర్‌కుక్కర్, నాల్గవ బహుమతులు-4 హాట్‌బాక్స్, ఐదవ బహుమతులు-8 కాఫీ కప్స్ సెట్స్‌తో పాటు కన్సోలేషన్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి, వేల్పుల గంగరాజు, అవులంపల్లి కేశవరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఆర్య కటిక స్టేట్ చైర్మన్ హరికృష్ణరావు, పరదేశి నారాయణస్వామి, తలారి లక్ష్మినారాయణ. తదితరుల నాయకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ద ఉత్సవాల సందర్భంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, జనవరి 13 ప్రభాతవార్త**

అనంతరూరల్ మండలం అక్కంపల్లి గ్రామపంచాయతీ లోని సదాశివన కాలనీ లో మంగళవారం సిపిఐ శతాబ్ద ఉత్సవాల, సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీ లు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం రూరల్ మండల కార్యదర్శి జి నరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున సీఐ శేఖర్ హాజరై ముగ్గుల పోటీలను వీక్షించి ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి రామకృష్ణ, నియోజకవర్గం కార్యదర్శి యం రమేష్ శ్రీకాంత్, నియోజకవర్గం కార్యదర్శి ధనుంజయ నియోజకవర్గం కార్యదర్శి శారద శాఖకార్యదర్శులు రెడ్డప్ప వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

**అమడగూరు, జనవరి 13 ప్రభాతవార్త**



ఎమ్మెల్యే, మాజీ మంత్రి

అమడగూరు మండల ప్రజలకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి లు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి అందరూ పాడిపంటలతో సంఖనంతోషాలతో వుండాలని ఆకాంక్షించారు. తెలుగు వారందరికీ సంక్రాంతి పండుగ చాలా ప్రాముఖ్యమైనదన్నారు. ఈ పండుగను మూడు రోజుల పాటు ఆనందంగా ఆటపాటలతో ముగ్గుల పోటీలతో తమ కుటుంబ సభ్యులతో కలిసిమెలిసి వివిధ పిండి పదార్థాలు వండుకొని సంతోషంగా గడుపుతారన్నారు. మండల ప్రజలు సుఖశాంతులు, ఆరోగ్యాలతో వుండాలని వారు ఆకాంక్షించారు.

# ఐటిఐ విద్యార్థులపై జె.సి ప్రశంసలు

**-పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్న వారికి జె.సి ప్రశంసాపత్రం ప్రదానం**



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఐటిఐ విద్యార్థులు

**తాడిపత్రిటౌన్, జనవరి 13 ప్రభాతవార్త**

ఐటిఐ విద్యార్థులు, ప్రిన్సిపాల్ నారాయణస్వామిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ప్రశంసలు కురిపించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని ఒక ప్రకటనలో జె.సి తెలిపారు. ఇటీవల వెంకటసాయి ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి కళాశాల విద్యార్థులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. వీరిని తాడిపత్రి యువత, విద్యార్థులు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని జె.సి పేర్కొన్నారు. ఈ విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వర్తిస్తే పట్టణం పరిశుభ్రత సులువు అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ విధంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్న విద్యార్థులకు, యువతకు జనవరి 14న ప్రభుత్వ కళాశాల మైదానంలో ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు.

# వార్త క్యాలెండర్ ఆవిష్కరణ



వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

**పెద్దవడుగూరు, జనవరి 13 ప్రభాతవార్త**

పెద్దవడగూరు మండల కేంద్రంలో మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా వార్త తెలుగు జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల వ్యాప్తంగా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు కథనాల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో వార్త దినపత్రిక ఎల్లప్పుడు ముందుంటుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి, వేల్పుల గంగరాజు, అవులంపల్లి కేశవరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఆర్య కటిక స్టేట్ చైర్మన్ హరికృష్ణరావు, పరదేశి నారాయణస్వామి, తలారి లక్ష్మినారాయణ. పెద్దవడుగూరు మండల వార్త విలేకరి సురేష్ పాల్గొన్నారు.

# మట్కా బీటర్ అరెస్ట్

- రూ. 12,410 స్వాధీనం

**తాడిపత్రిటౌన్, జనవరి 13 ప్రభాతవార్త**



మట్కా బీటర్‌ను చూపుతున్న దృశ్యం

తాడిపత్రి పట్టణ సమీపంలోని పుట్లూరు రోడ్డులో వున్న ఆర్డీటి కాలనీలో మట్కా నిర్వహిస్తున్న షేక్ చాంద్‌బాష అనే మట్కా బీటర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ ధరణిబాబు తెలిపారు. మట్కా నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి మట్కా బీటర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 12,410 రూపాయలతో పాటు మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# సహకార సంఘంలో రైతులకు అందుబాటులో దాణా

**అమరాపురం జనవరి 13 ప్రభాతవార్త**



దాణా పంపిణీ దృశ్యం

మండల కేంద్రం లోని వ్యవసాయ సహకార సంఘం లో మండలంలోని రైతుల పశువులకు కావలసిన పశువుల దాణ అందుబాటులో ఉన్నట్లు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, డైరెక్టర్లు డాక్టర్ ధనుంజయ, దాదా పీర్ లు తెలిపారు. ఈ సందర్భంగా సింగల్ వెంట్ అధ్యక్షుడు గణేష్ రైతులకు దాణ పంపిణీ నీ ప్రారంభించారు. అదేవిధంగా రైతులకు కావలసిన డిఎపి కాంప్లెక్స్ వేప పిండి అందుబాటులో ఉన్నట్లు ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మంజునాథ్, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి యువ నాయకుడు తమ్మడేపల్లి హనుమంతరాయ, కాచికుంట మంజునాథ్, ఆనందప్ప సిబ్బంది మంజునాథ్, దేవరాజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద పుస్తకాల పంపిణీ

**తాడిపత్రిటౌన్, జనవరి 13 ప్రభాతవార్త**



వివేకానంద పుస్తకాలను అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రి పట్టణంతో పాటు మండలంలోని భోగసముద్రం గ్రామంలోని యువతీ యువకులకు రుద్రశక్తి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద పుస్తకాలను మంగళవారం పంపిణీ చేయడం జరిగింది. స్వామి వివేకానందుని బాల్యం నుండి చరిత్రను తెలియచేసే పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని రుద్రశక్తి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు భీమిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సువర్ణ, పురందేశ్వర్‌రెడ్డి, వైష్ణవి, కార్యవర్గ సభ్యులు లావణ్య, శ్రీనివాసులురెడ్డి, శాన్వికరెడ్డి, కృష్ణారెడ్డి, శశిదేవి, కళావతి, అఖిల, చిన్నన్న పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను సద్వినియోగం చేసుకోండి

- అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**యాడికి, జనవరి 13 ప్రభాతవార్త**

అయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ తెలియచేశారు. యాడికి మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ వైద్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాల్సిందిగా తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీనివాసులురెడ్డి, పరమేష్ మాట్లాడుతూ ఈ కార్డు ప్రాధాన్యత కలిగి ఉందని, ఒక వ్యక్తి యొక్క ఆరోగ్యం గురించి, వాటి వివరాల గురించి ఈ కార్డు తెలుపుతుందని భారతదేశంలో ఎక్కడైనా గాని దీనిని సద్వినియోగం చేసుకోవచ్చున్నారు. ఈ కార్డు దాదాపు 5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందని ఈ పథకం అర్హులైన వారు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు కొరకు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎస్ఐ

**అమడగూరు, జనవరి 13 ప్రభాతవార్త**



ఎస్ఐ గోపాలకృష్ణ

అమడగూరు మండల ప్రజలకు ఎస్ఐ గోపాలకృష్ణ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందాలు, తదితర వాటిని నిర్వహించరాదన్నారు. అందరూ సంతోష వాతావరణంలో సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఎస్ఐ తెలియచేశారు.

# తగరకుంట గులగాని వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

**తలుపులు, బీరువాలు ధ్వంసం చేసిన దుండగులు**

**కనగానపల్లి జనవరి 13 ప్రభాతవార్త**





దుండగులు వైకుంఠ ద్వారం తలుపులకు రంధ్రం వేసిన దృశ్యం , బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

మండల పరిధి లోని తగరకుంట గ్రామ సమీపంలో కొండపైన అతి పురాతన గులగాని వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి చొరబడ్డారు. గ్రామస్తులు, పోలీసుల వివరాల మేరకు కొండపైకి కారులో వచ్చి ఆలయ వైకుంఠ ద్వారం ఇనుప తలుపులను గ్యాస్ కట్టర్ వెల్డింగ్ ద్వారా తొలగించి ఆలయంలో ప్రవేశించారు. అక్కడ ఉన్న బీరువాను, ఇనుప బీరువాను వెల్డింగ్ తో రంధ్రాలు వేశారు. ఆలయంలో వారికి ఏమి దొరకపోవడంతో దుండగులు అక్కడ నుండి వెళ్లిపోయి ఉంటారని తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసులు, క్లూస్ టీం దేవాలయం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆలయంలో విలువైన వస్తువులు ఏమీ లేవని బీరువాలు వైకుంఠ ద్వార తలుపులు మాత్రం దుండగులు ధ్వంసం చేశారని పోలీసులు, ఆల కమిటీ సభ్యులు నిర్ధారించారు. ఈ దేవాలయంలో గత నాలుగు నెలల క్రితం దక్షిణ ద్వారం వైపు చోరీ చేసేందుకు దుండగులు ప్రయత్నం విఫలయత్నం అయింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్తులు భక్తులు కోరుతున్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**పుట్లూరు, జనవరి 13 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం అరకటివేముల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఎం.రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా రబీ పంటలకు సంబంధించిన ఈ-పంట నమోదును పరిశీలించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి ఎం.రవి మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలన్నీ పంట నమోదు వేగవంతం చేయాలని తెలియజేశారు. పప్పుశనగ పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ రాఖేష్‌నాయక్, మండల వ్యవసాయాధికారిణి కాత్యాయని, ఏఈఓ చిన్ననాగిరెడ్డి, ఎంపిఈఓ సుమతి, రైతులు పాల్గొన్నారు.

# అంబాభవాని దేవాలయంలో ముగ్గుల పోటీలు



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు న

**తాడిపత్రిటౌన్, జనవరి 13 ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అంబాభవాని దేవాయలంలో మంగళవారం ఆలయం పాలకవర్గం సభ్యులు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో దాదాపు 23 మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేసి మిగిలిన 20 మందికి చీరలను అందజేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఆదోని మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ జిందే శారదాబాయి దంపతులు విచ్చేసి ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వకులసాలి సమాజం అధ్యక్షులు కాంబ్లె నాగేష్, స్వకులసాలి సమాజం తాడిపత్రి ప్రెసిడెంట్ చంద్రశేఖర్, స్వకులసాలి సమాజం మహిళా మండలి ప్రెసిడెంట్ శారదాబాయి, చంద్రకళ, లక్ష్మీ, పెద్దఎత్తున స్వకులసాలి సమాజం సభ్యులు పాల్గొన్నారు.

# నగర పంచాయతీ కార్యాలయం విజిట్ చేసిన రీజినల్ డైరెక్టర్ నాగరాజు



మున్సిపల్ సిబ్బందితో సమావేశమైన రీజినల్ డైరెక్టర్



కంపోస్ట్ యార్డును పరిశీలిస్తున్న దృశ్యం

**పెనుకొండ జనవరి 13 (ప్రభాతవార్త)**

పెనుకొండ నగర పంచాయతీ కార్యాలయంను మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు మంగళవారం విజిట్ చేశారు. ఈ సందర్భంగా పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2025 2026 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలముల పన్నులు, ప్రైవేట్ కొళాయిల ఫీజులు వసూళ్లు మరియు ట్రేడ్ లైసెన్స్ అరియర్, ప్రస్తుత సంవత్సరమునకు సంబంధించిన డిమాండ్, వసూలు మరియు నిలువపై ఏడు వార్డుల సచివాలయ సిబ్బంది, రెవెన్యూ ఇన్స్పెక్టర్, మేనేజర్, అసిస్టెంట్ ఇంజనీర్ , కమిషనర్ తో వసూళ్ల పురోగతి పై సమీక్ష నిర్వహించారు. అందులో స్థానిక సంస్థల నిర్వహణ, ప్రజల మౌలిక వసతుల కల్పనకు ఇంటి పనులు చాలా కీలకమైన వనరులని కావున సదరు పన్నులు వసూళ్లు ఫిబ్రవరి 26 మాసంతంలోగా 80శాతం వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణమునకు సంబంధించిన కంపోస్ట్ యార్డు ని తనిఖీ చేశారు. కంపోస్ట్ యార్డ్ నందు ఇటీవల వేసిన ప్రాంతంను పరిశీలించారు. ఈ ప్రాంతం వినియోగంలో భవిష్యత్ కార్యాచరణ చేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ రామ్మోహన్, పెనుగొండ నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మలుపులో కంపలు తొలగిస్తున్న పోలీసులు

**అమరాపురం జనవరి 13 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి గ్రామానికి అమరాపురం నుండి వెళ్లే ప్రధాన రహదారిలో మలుపు వద్ద ఉన్న పెద్ద కంప చెట్లను మరియు ఉదగూరు, కాచికుంట గ్రామాల మధ్య ఉన్న మలుపులో ఉన్న కంప చెట్లను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, మడకశిర రూరల్ సీఐ రాజకుమార్ ఆధ్వర్యంలోజెసిబి ద్వారా తొలగించే కార్యక్రమానికి అమరాపురం ఏఎస్ఐ రామాంజనేయులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రమాదాలకు నిలయమైన మలుపుల వద్ద ఉన్న కంపచెట్లను తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించడానికి పోలీసులు ప్రజాసేవా కార్యక్రమాలను చేపట్టడానికి పూనుకోవడం ద్వారా ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది. కేవలం లాఠీలకే పరిమితం కాకుండా ప్రజాసేవ కూడా చేయడానికి పోలీసులు కృషి చేస్తారని అభిప్రాయం ప్రజల నుండి వ్యక్తమైనది.



కంపలను తొలగిస్తున్న పోలీసులు

# నిత్యావసర సరుకుల పంపిణీ

**అనంతపురం కల్చరల్,జనవరి 13 ప్రభాతవార్త**

అనంతపురం పట్టణంలో నివాసముంటున్న ఇద్దరు నిండు బాలింతలకు దాతల సహాయంతో సరుకులు అందజేయడం జరిగిందని గరీబ్ క దర్ద్ ట్రస్ట్ ప్రెసిడెంట్ హాజీ జిలాన్ భాష తెలిపారు. స్పందించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఆకుల అబ్దుల్లా గుత్తి ఖాయిమ్ ఎలక్ట్రిషన్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

